క్లుప్తంగా

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం జ్యేష్ఠ మాసం, అష్టమి తిథి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఎండీఎంలో నాణ్యత అవసరం



కారంచేడులో ఎండీఎం పరిశీలిస్తున్న ఎంఈఓ సత్యన్నారాయణ

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని నాణ్యతతో నిర్వహించాలని ఎంఈఓ ఎంవీ సత్యన్నారాయణ అన్నారు. బుధవారం కారంచేడు యార్లగడ్డ నాయుడమ్మ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. క్రమం తప్పకుండా మెనూను పాటించాలన్నారు. సోమవారం నుంచి శనివారం వరకు అందించాల్సిన మెనూను డిస్‌ప్లే చెయ్యాలన్నారు. హెచ్ఎం ఎస్. సామ్రాజ్యం, ఉపాధ్యాయులు, కుకింగ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే చర్యలు



వేమవరంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై

బల్లికురవ: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై నాగరాజు కోరారు. బుధవారం వేమవరంలో పలు వాహనాలను తనిఖీ చేశారు. కార్లు తోలేవారంతా సీటు బెల్ట్ ధరించాలని ద్విచక్రవాహనాలు నడిపేవారంతా హెల్మెట్ ధరిస్తు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ట్యాక్స్‌లు సకాలంలో చెల్లించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే సీజ్ చేస్తామని ఎస్సై హెచ్చరించారు.

సంక్షేమ పథకాలు అమలు చేయండి



నిరసన తెలియజేస్తున్న కార్మికులు

అద్దంకి: మునిసిపల్ కార్మికులకు తల్లికి వందనం, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుతూ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తల్లికివందంతోపాటు, సంక్షేమ పథకాలన్నీ కార్మికులకు అమలు చేయాలని వారి డిమాండ్స్‌ను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మునిసిల్ కార్మికులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి

చీరాల టౌన్: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో ఉన్న ఉపాధి కూలీలందరికీ పనులు కల్పించాలని ఎంపీడీఓ శివన్నారాయణ ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ చీరాల మండలంలోని 15 పంచాయతీల్లో 11 గ్రామ పంచాయతీల్లో ఉన్న ఉపాధి కూలీలు అందరికీ ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. ఉదయం 6.30 నుంచి 10 గంటల వరకు కల్పించడంతో పాటు పని ప్రదేశంలో మంచినీటి, ప్రాథమిక చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ఉపాధి కూలీలు అందరి వివరాలను జాబ్‌కార్డులతో పాటుగా మస్టర్లలో నమోదు చేయాలన్నారు. కూలి డబ్బులను వారి బ్యాంకు ఖాతాల్లోనే జమ చేయాలని సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది విధులను విస్మరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ దాసు టీఏలు, ఎఫ్ఏలు, సిబ్బంది ఉన్నారు.

ఇంకొల్లు బస్టాండ్ అస్తవ్యస్తం

- నిండిపోయిన సెప్టిక్ ట్యాంకు
- రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీరు
- దుర్గంధం భరించలేక ప్రజలు అవస్థలు

ఇంకొల్లు(చినగంజాం): మండల కేంద్రం ఇంకొల్లు ఆర్టీసీ బస్టాండులోని సెప్టిక్ ట్యాంక్ నిండిపోయి మురుగు నీరు రోడ్డుపైకి ప్రవహిస్తుండటంతో స్థానిక నివాస గృహాలవారు, ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ట్యాంకు పూర్తి స్థాయిలో నిండిపోయి మంగళవారం అర్ధరాత్రి నుంచి మురుగు, వ్యర్థాలు రోడ్లపైకి ప్రవహిస్తున్నాయి. దాంతో ప్రజలు దుర్వాసన భరించలేక ఆ ప్రాంతంలో కనీసం నిలబడలేక పోతున్నారు. ఇక నివాస గృహాల వారి పరిస్థితి చెప్పనక్కర్లేదు. సెప్టిక్ ట్యాంక్‌కు సంబంధించిన మాన్యువల్ పైపులు కూడా పూర్తిగా దెబ్బతినడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. అప్పటికీ స్థానికులు మురుగు పారేలా చర్యలు తీసుకున్నప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మురుగునీటిని పంపించి వేసేందుకు వారు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఆర్టీసీ బస్టాండులోని సెప్టింక్ ట్యాంకు పూర్తిగా నిండి పోయిన దృష్ట్యా దానికి పూడిక తీసి మరమ్మతులు నిర్వహిస్తే సమస్య తీరేందుకు అవకాశం ఉంటుందని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



ఇంకొల్లు బస్టాండు సమీపంలో రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు



మురుగు నీరు పంపించేందుకు స్థానికుల తంటాలు

కారు అడ్డంగా పెడితే ఎలా సారూ..?



కార్యాలయానికి వెళ్లే వీలులేకుండా ఎంపీడీఓ కారును పార్కింగ్ చేసి ఉన్న దృశ్యం

చీరాల టౌన్: చీరాల మండల పరిషత్ కార్యాలయం నిత్యం వందలాది మంది మండల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రభుత్వ కార్యాలయం. కానీ ప్రస్తుతం ఆ కార్యాలయంలోకి వెళ్లాలంటే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కారణం మండల పరిషత్ అభివృద్ధి అధికారి కారును దర్జాగా కార్యాలయం మెట్ల ముందు పార్కింగ్ చేయడమే. దీంతో కార్యాలయంలో వెళ్లేందుకు మెట్లు ఎక్కే వీలులేకపోవడంతో దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన ర్యాంపుపై వెళ్తున్నారు. మండల పరిషత్ అధికారి తన కారును మాత్రం కార్యాలయంలోకి వెళ్లే మెట్ల ముందుగా నిలుపుదల చేయడంతో అటు ఉద్యోగులు, ఇటు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇకనైనా అధికారి తమ సొంత వాహనాన్ని మెట్ల ముందు నిలుపుదల చేయకుండా ఉండాలని ఉద్యోగులు.. ప్రజలు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



సుజాత నగర్ కాలనీలోఎంపిక చేసిన కమిటీ సభ్యులు

బల్లికురవ: కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయినా ఇచ్చిన హామీలు పూర్తి స్థాయిలో అమలు పరచనందున ప్రజలు అసంతృప్తిలో ఉన్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు అన్నారు. బుధవారం రాత్రి ఎస్ఎల్ గుడిపాడు పంచాయతీలోని సుజాత నగర్ కాలనీలో గ్రామ, బూత్ కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక కూటమి నేతలు పోలీస్ అధికారులతో కుమ్మక్కై ఆయన పర్యటన అడ్డుకుంటున్నారని..అయినా ప్రజలు ఆగటం లేదని కృష్ణబాబు అన్నారు. ఇటీవల పొదిలి, సత్తెనపల్లిలో జరిగిన పర్యటనలే ఇందుకు నిదర్శనమన్నారు. ఎస్ఎల్ గుడిపాడు గ్రామ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా మూరబోయిన వీరాంజనేయులు, యెర్రిబోయిన వెంకటేశ్, బూత్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా రావులపల్లి వెంకటేశ్వర్లు, మూరబోయిన నాగార్జున సుజాతనగర్ కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు ఆలకుంట రాజయ్య, మేదర ఇమ్మానియేలు మరికొంత మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పత్తిపాటి అక్కయ్య, గన్నమనేని వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి



టెంకాయలు కొడుతున్న భక్తులు



మొక్కుబడి ప్రభను కట్టిన వైఎస్సార్ సీపీ నాయకులు

సంతమాగులూరు (అద్దంకి): మండలంలోని పుట్టావారిపాలెం(అడ్డరోడ్డు) లో బుధవారం గంగమ్మ తల్లి వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దానిలో భాగంగా అమ్మవారికి పసుపు కుంకుమలతో పూజ నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ వార్షికోత్సవ కార్యక్రమానికి గ్రామంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అత్యధిక సంఖ్యలో హాజరై టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆ గంగమ్మ తల్లి కరుణించి సకాలంలో వాగులు వంకల్లో నిండుగా ఉండాలని ప్రార్థించారు. పూజల అనంతరం హాజరైన భక్తులకు వేలాదిగా అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. గంగమ్మతల్లిని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, సరేంద్ర, కొల్లివెంకట్రావు, గుర్రం కొండలు, గోలిరామారావు, సజ్జల పిచ్చిరెడ్డితోపాటు అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా గ్రామ కమిటీ పెద్దలు పర్యవేక్షించారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): మండలంలోని పుట్టావారిపాలెం గ్రామలో కొలువై ఉన్న గంగమ్మ తల్లి తిరునాళ్ల బుధవారం ఘనంగా నిర్వహించారు. సమీప గ్రామాల్లోని భక్తులు ఉదయం నుంచి అమ్మవారి దేవస్థానానికి చేరుకుని పొంగళ్లు పెట్టి నివేదించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరిచారు. దేవస్థాన కమిటీ గ్రామ పెద్దలు అన్నసంతర్పణ నిర్వహించారు. మండల వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బత్తుల రామచంద్రరావు, అద్దంకి ఆంజనేయులు, ఓగిబోయిన వీరయ్య, మాదాల బ్రహ్మేంద్ర మొక్కుబడి ప్రభలు కట్టారు. రాత్రికి విద్యుత్ ప్రభ ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మహాసభ జయప్రదం చేయండి



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి

సంతమాగులూరు(అద్దంకి): పుట్టావారిపాలెంలో జూలై 2వ తేదీన నిర్వహించనున్న సీపీఐ అద్దంకి నియోజకవర్గం ఆరో మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తన్నీరు శింగరకొండ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని కొమ్మలపాడులో నేషనల్ ల్యాబ్ ప్రాంగణంలో నిర్వహించిన నియోజకవర్గ సీపీఐ కార్యవర్గ సమావేశానికి మండల కార్యదర్శి మల్లెల యేసోబు అధ్యక్షత వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి తన్నీరు సింగరకొండ మాట్లాడుతూ పార్టీ నిర్మాణంలో భాగంగా ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి గ్రామ శాఖ నుంచి జాతీయ స్థాయి వరకు పార్టీ మహాసభలు నిర్వహించుకోవడం ఆనవాయితీ అన్నారు. దానిలో భాగంగా ప్రతి నియోజకవర్గ మహాసభలను తక్షణమే నిర్వహించాలని కోరారు. తరువాత కార్యవర్గంతో చర్చించి జూలై రెండో తేదీ బుధవారం నాడు పుట్టావారి పాలెంలో అద్దంకి నియోజకవర్గం మహాసభలు నిర్వహించాలని కార్యవర్గంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పూర్ణచంద్రరావు, షేక్ ఖాదర్బాషా కాలేశా గారి, వలి మేకల రమణయ్య వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే కొనుగోలు చేయాలి

చీరాల టౌన్: వ్యవసాయ సీజన్‌లో పంటలు సాగు చేసే రైతులు తమకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను లైసెన్స్‌స్ డీలర్లు వద్దనే కొనుగోలు చేసి బిల్లులు జాగ్రత్తగా దాచుకోవాలని మండల వ్యవసాయాధికారి పి.నిర్మలాదేవి సూచించారు. బుధవారం మండలంలోని విజయనగర్ కాలనీ, ఈపురుపాలెం గ్రామ పంచాయతీల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని రైతులతో సమావేశమై రైతులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, రాయితీలు, వ్యవసాయ శాఖ సూచనలు అందించారు. ఈసందర్భంగా మండల ఏఓ మాట్లాడుతూ పంటల సాగుకు సమాయత్తమయ్యే రైతులు విత్తనాల ఎంపిక, కొనుగోలును ప్రభుత్వ గుర్తింపు ఉన్న డీలర్లు వద్దనే కొనుగోలు చేసి బిల్లులను జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. కల్తీ విత్తనాల బారినపడకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ప్రభుత్వం రైతులకు అందించే పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశుసంవర్ధక శాఖ గ్రామ సహాయకులు అవినాష్ మాట్లాడుతు పాడిపశువులు, గొర్రెలు, మేకలు పెంపకం చేసే పశుపోషకులు జీవాల ఆరోగ్యంపై దృష్టి ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధులకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామంలోని రైతులు, పశుపోషకులు పాల్గొన్నారు.

ధ్యానంతో వ్యాధినిరోధక శక్తి



పర్చూరు: యోగా చేస్తున్న పాఠశాల విద్యార్థులు



విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ శ్రీబాబు

పర్చూరు(చినగంజాం): ధ్యానం చేయడం వల్ల వ్యాధినిరోధక శక్తి, జ్ఞాపకశక్తి పెరుగుతుందని పర్చూరు మండల యోగా పర్యవేక్షకులు, మాస్టర్ ట్రైనర్, హోమియోపతి వైద్యులు డాక్టర్ దాసరి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం స్థానిక వైఆర్ హైస్కూల్, శారదా, ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులకు యోగాపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజూ ప్రాణాయామం, ధ్యానం చేయడం వల్ల విద్యార్థులకు చదువు ఒత్తిడి నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ప్రతి పాఠశాలలో సాయంత్రం సమయంలో అరగంట పాటు యోగా చేయించాలని పాఠశాల యాజమాన్యాలకు సూచించారు. తద్వారా విద్యార్థులకు విద్యతో పాటు సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందుతారని వివరించారు. అనంతరం అందరికీ అంతర్జాతీయ విహారయాత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలిపారు. ఎంఈఓ వెంకట రామయ్య, వైఆర్ హైస్కూల్ హెచ్ఎం ఈదర రాజశేఖర్, శారదా, ఆక్స్‌ఫర్డ్ స్కూల్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చినగంజాం: చిన్నతనం నుంచే యోగా, ధ్యానం చేయడం ద్వారా మానసిక సామర్థ్యం, మెరుగైన ఆరోగ్య స్థితి కలుగుతుందని సోపిరాల ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సాయి సుధా మాధవి అన్నారు. బుధవారం ఈ నెల 21 న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం గురించి విద్యార్థులకు అవగాహన కలుగజేస్తూ వారి చేత యోగ, వ్యాయామం, ధ్యానం వంటి పలు అంశాలను నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయుడు, యోగా ట్రైనర్ పల్లపోలు శ్రీ బాబు విద్యార్థులచే యోగాసనాలు, వ్యాయామ ప్రక్రియలను నిర్వహింపజేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు తరలిరావాలి



మాట్లాడుతున్న వసంతరావు

చీరాల అర్బన్: కార్మికుల సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్తంగా జూలై 9న చేపట్టిన జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఎం.వసంతరావు అన్నారు. బుధవారం పట్టణంలోని కార్యాలయంలో పట్టణ కమిటీ విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. అధ్యక్షుడు ఎస్.బాబూరావు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు, కోర్కెల సాధనకై జూలై 9న జాతీయ సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చారని, ఇవి అమలు అయితే కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పనిదినం కోల్పోతామన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో లేబర్ కోడ్స్ అమలు జరిపితే పతనం కాక తప్పదన్నారు. సీఐటీయూ నాయకులు జి.సుధాకర్. ఆర్‌వీఎస్ రామ్‌రెడ్డి, కె.నీలాంబరం, ఎం.శివనాగరాజు, కె.ఏసురత్నం, సులోచన, సంధ్య, అరుణ, వెంకటేశ్వరమ్మ, పోతురాజు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై కార్మికుల వేడుకోలు



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

చీరాల అర్బన్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు చిమటా వీరాస్వామి మాట్లాడుతూ ఇంజినీరింగ్ కార్మికులకు జీఓ నంబర్ 36 ప్రకారం రూ.21 వేలు, రూ.24,500 జీతాలు చెల్లించాలన్నారు. షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. పదవీవిరమణ వయస్సు 62 ఏళ్ళుకు పెంచాలని, పదవీవిరమణ తర్వాత అందించే సౌకర్యాలను అందించాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే ఉద్యోగాలు పర్మినెంట్ చేయాలని డిమాండ్‌చేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. చట్టబద్ధమైన సెలవులు అమలు చేయాలని, కిట్లు, భద్రతా సౌకర్యాలు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. నాగేశ్వరరావు, చాంద్‌బాషా, అశోక్, కాంతారావు, చందు, సంగీతరావు, సురేష్, ప్రసాద్, ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో లాభం



కోనంకిలో అరటి తోట రైతులతో మాట్లాడుతున్న ఏఓ లావణ్య, అధికారులు



వేటపాలెం: మాట్లాడుతున్న ఏఓ సరిత

మార్టూరు: రైతులు పంటల మార్పిడిని అవలంబించడం ద్వారా భూసారం పెరగడంతో పాటు ఉద్యానవన పంటల సాగుతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి రామినేని లావణ్య అన్నారు. మండలంలోని కోనంకి గ్రామంలో బుధవారం అరటి, డ్రాగన్ ఫ్రూట్ తదితర ఉద్యానవన పంటలను పరిశీలించిన ఆమె రైతులతో మాట్లాడారు. మార్టూరు మండలంలో ఎర్ర నేలలు అధికంగా ఉండటం, నీటి లభ్యత అనుకూలంగా ఉండటంతో పాటు ప్రభుత్వం రాయితీలతో కూడిన అనేక ప్రోత్సాహకాలు అందుకుని పండ్లు, పూల మొక్కల సాగు తో రైతులు లాభాల బాట పట్టవచ్చని తెలిపారు. పేడ తదితర పదార్థాలతో ద్రవ, ఘన జీవామృతాలు తోపాటు పంచగవ్య కషాయాల తయారీ గురించి తమ సిబ్బందితో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ మరియు ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బంది, స్థానిక రైతులు పాల్గొన్నారు.

తగిన మోతాదులో ఎరువులు వాడుకోండి

వేటపాలెం: రైతులు భూసార పరీక్షల ఫలితం మేరకు తగిన మోతాదులో ఏరువులు వాడుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎం. సరిత సూచించారు. మండలం పరిధిలోని అక్కాయిపాలెం, కొత్తపేట రైతు సేవా కేంద్రం వద్ద పోలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడు తూ రైతులు కాయగూరలు సాగు చేసుకోవడం వల్ల లాభదాయ కంగా ఉంటుందని తెలిపారు. బీర, సొర పరిశీలించారు. చీడపీడల నివారణ గురించి అవగాహన కల్పించారు. ఖరీఫ్ పంటలకు సంబంధించి పంట నమోదు చేసుకోవాలని తెలిపారు. పచ్చిరొట్ట పైరు సాగు చేసుకోవడం ద్వారా భూసారాని పెంపొందించు కోవచ్చని తెలిపారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం సంబంధించి ఈకేవైసీ చేయించు కోవాలని కోరారు. వ్యవసాయ సహాయకులు శివనాగబాబు, స్వాతి, ఐసీఆర్‌పీలు సురేఖ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

20న సామాజిక ప్రజా వేదిక కార్యక్రమం

అద్దంకి: మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన ఉపాధి పనులపై, స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 20న ఉపాధి హామీ పనుల తనిఖీపై సామాజిక ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శింగయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొనాలని కోరారు.

పాఠశాలల్లోనే బడిబయట పిల్లలు

చినగంజాం: బడి బయట పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్చుకునేందుకు మండలంలోని కొత్తపాలెం పంచాయతీ రామచంద్రనగర్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు చర్యలు తీసుకున్నారు. ఇందులో భాగంగా పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ మస్తాన్‌రావు ఆధ్వర్యంలో గ్రామ పరిధిలోని పలువురు కుటుంబాలను ఉపాధ్యాయ బృందం సంప్రదించి వారి పిల్లలను బడిలో చేర్పించాల్సిందిగా తల్లిదండ్రులను అభ్యర్థించారు. కొత్తగా పాఠశాలలో చేర్పించేర్పించే పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని. ప్రభుత్వ బడిలో చేరే బాలబాలికలకు ప్రభుత్వం ఇచ్చే పథకాలను వివరిస్తూ తల్లిదండ్రులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా కొత్తగా పాఠశాలలో చేరే విద్యార్థులను నమోదు చేసుకున్నారు. హెచ్ఎం షేక్ నాయబ్ రసూల్, ఉపాధ్యాయుడు సిద్దం నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులను నమోదు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

నల్లబర్లీ రిజిస్ట్రేషన్ చేయించుకోండి

బల్లికురవ: నల్లబర్లీసాగు చేసిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో గురువారం నుంచి సీఎం యాప్‌లో రిజిస్ట్రేషన్‌తో అమ్ముకోవచ్చని వ్యవసాయాధికారి పి. శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. రైతులు పొగాకును రెండు గ్రేడులుగా విభజించుకుని.. 25 కేజీల నుంచి 150 కేజీల్లోపు తేమశాతం తక్కువగా ఉండేలా బేళ్లు కట్టుకోవాలని వివరించారు.